క్లుప్తంగా

హెచ్‌ఎం సునీతకుమారికి అభినందనలు


జిల్లా అవార్డు గ్రహీత సునీతకుమారిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

గంగవరం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అడ్డతీగల ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. ఇటీవల పాడేరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవాల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సలీంభాషా, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చేతులు మీదుగా సునీత కుమారి అవార్డు పొందారు. ఈ సందర్భంగా ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎంఈవో–2మల్లేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం వైస్ ఎంపీపీ రామతులసీ, గంగాదేవి తదితరులు అభినందనలు తెలియజేశారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి


ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. ఆమె గురువార విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కురుస్తున్న భారీ వర్షలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. జోరుగా కురుస్తున్న వర్షాల సమయంలో బయటకు రావొద్దన్నారు.

మంత్రి రాజన్నదొరపై ఆరోపణలు సరికాదు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై టీడీపీ ఎస్టీ సెల్ ధారునాయక్ నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి ఖండించారు.ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పీడిక రాజన్నదొర నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉండి, నిస్వార్థంగా ప్రజలకు సేవలను అందిస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, గిరిజనాభివృద్ధికి తనదైన ముద్రను వేసుకున్నారన్నారు. కనీసం వార్డు సభ్యుడిగా గెలవలేని ధారునాయక్ గిరిజన మంత్రిపై ఆరోపణలు చేయడం దారుణమని, దీన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి జరిగిందని, ఇదీ టీడీపీ నాయకులకు కన్పించడం లేదా అంటూ విమర్శించారు.

సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన


బూసిపుట్టులో పార్టీ నేతలతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ కొండలరావు, నాయకులు తిరుపతి రావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన నేడు

కొయ్యూరు: మండలంలోని రంపుల నుంచి నిమ్మలగొంది వరకు చేపడుతున్న రోడ్డు పనులకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు చెప్పారు. రూ.2.5కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు తరలిరావాలని కోరారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి


గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ధారకొండ సచివాలయం పరిధిలో కొంగపాకలు, వర్తండపాడు, పెంటలగెడ్డ, డి.కొత్తూరు, కమ్మరితోట, చీడిగుంట, తోకరాయి, బీముడుపాకలలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 325 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారన్నారు. వికేంద్రీకరణ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని అమలుచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ పొందేందుకు పండుటాకులు నానా అవస్థలు పడేవారని, జన్మభూమి కమిటీలు నచ్చిన వారికే ఇచ్చే వారని, అర్హులకు తీవ్ర అన్యాయం జరిగేదని గుర్తు చేశారు. నేడు జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పింఛన్ల, ఇతర పథకాలన్నీ అందుతున్నాయన్నారు. పంచాయతీల అభివృద్ధి నిమిత్తం సచివాలయం కోసం రూ.40 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చిన మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, సర్పంచ్ ఎస్.రాజు, ఎంపీటీసీ ఎం.రమణ, నాయకుడు పి.నాగమణి,, బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లా బుజ్జి, సర్పంచ్‌లు రామకృష్ణ, ఎం.కమలమ్మ, జిల్లా కార్యదర్శి కె.గిరి ప్రసాద్, మాజీ ఎంపీపీ ఎస్.కాసులమ్మ, నాయకులు మోహన్‌రావు, రామారావు, ప్రసాద్, గోపాల్, చిట్టిబాబు, గాసి, శ్రీను, ఈశ్వరరావు, రాంబాబు, మోహన్, లోవరాజు, వార్డు సభ్యులు మణి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో చక్కని ఆరోగ్యం


మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: పోషకాహారంతోనే బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు మంచి ఆరోగ్యం లభిస్తుందని, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో బాలచంద్రమణి దేవి ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాలతో పాటు గ్రామల్లో లభించే తోటకూర, గుమ్మడి తదితర ఆకుకూరలు, కాయగూరలు బాలింతలు, గర్భిణులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ పథకం గిరిజన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఉద్యోగులు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, ఎమ్మార్వో రాజ్యలక్ష్మి, ఏపీవో లింగమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఐసీడీఎస్ సిబ్బంది, మాస్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం


ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు పంపిణీ చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన రైతులకు వరాహ కంపెనీ అందిస్తున్న జీడిమామిడి మొక్కలను పొలాల్లో నాటుకుని సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం వరాహ ఆగ్రో ఫారెస్ట్ ద్వారా రైతులకు ఉచితంగా జీడిమామిడి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీలో రైతులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న అనేక వ్యవసాయ యాంత్రికరణ పరికరాలను వినియోగించుకోవాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. జీడిమామిడి సాగులో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. వరాహ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ వేములకొండ, ఐ.పోలవరం, దారగూడెం, సీమగండి గ్రామాల్లో గిరిజన రైతులకు మూడు వేల జీడిమామిడి అంట్లు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు.కార్బన్ క్రెడిట్స్ ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తోందన్నారు. తమ సంస్థ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతుందన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి, అన్నవరం బోర్డు సభ్యురాలు కారుకోడి పూజ, ఎంపీటీసీ సభ్యురాలు ఉలవల లక్ష్మి, కాపారపు రూతు, వరాహ సంస్థ ప్రతినిధులు శివకుమార్, బాబాయ్,అరవింద్, అప్పన్న పాల్గొన్నారు.

నేడు నిమ్మలగొందిలో గడప గడపకు

కొయ్యూరు: మర్రివాడ సచివాలయం పరిధిలో నిమ్మలగొందిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం తెలిపారు. పార్టీ శ్రేణులు, సంబంధిత అధికారులంతా హాజరుకావాలని వారు కోరారు.

నేడు మండల సమావేశం

దేవీపట్నం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు ఇందుకూరుపేటలోని ఆర్‌బీకేలో నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పథకాలపై సమీక్షించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఎటపాక : మండలంలోని కాపవరంలో తెలంగాణ నుంచి తెచ్చిన అక్రమ మద్యాన్ని గురువారం ఎటపాక పోలీసులు పట్టుకున్నారు. 137 క్వాటర్ బాటిళ్లు, పది బీరు సీసాలు స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పార్థసారధి తెలిపారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని కిల్లంకోట, లువ్వాసింగి, బొయితిలి పంచాయతీలకు చెందిన గ్రామ పెద్దలు, పాత కేసుల్లోని గంజాయి నిందితులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి సాగు చేయటం, రవాణా, గంజాయి విక్రయాలకు మధ్యవర్తులగా వ్యవరించటం చేసే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. గ్రామ పెద్దలు తమ గ్రామాల్లో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించి, ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. గిరిజనులకు ఎళ్లవేళలా పోలీసు సహాయ సహకారాలుంటాయన్నారు.

జేజేఎం పనులపై సర్వే


వివరాలను తెలియజేస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: మండల వ్యాప్తంగా జరిగిన జల్‌జీవన్ మిషన్ పనుల పనితీరుపై ఈనెల 22 నుంచి గ్రామస్థాయిలో సర్వే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. ఈ మేరకు సర్వే జరిగే తీరుతో పాటు ఏఏ అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుందో అనే విషయాలపై గురువారం గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో జరిగిన జల్‌జీవన్ మిషన్ పనుల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షిస్తారన్నారు. రిజిష్టర్ల నిర్వహణ, మంచినీటి ట్యాంక్‌లు క్రమం తప్పకుండా క్లీనింగ్, పారిశుధ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర బృందం సభ్యులు పరిశీలించి సూచనలిస్తారన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది, జల్‌జీవన్ మిషన్ సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతితో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు: మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో వంద రోజుల ఉపాధి పనులు పూర్తి చేసిన కుటుంబాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉన్నతి కార్యక్రమం ఉపాధి శిక్షణ అందజేస్తున్నట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంట్రర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలు కలిగిన యువతీ, యువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శివప్రసాద్, ఉపాధి ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

రాజవొమ్మంగి: ద్వారబంధాల చంద్రయ్య జయంతిని అధికారికంగా జరపాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులపై, జమీందారీ వ్యవస్థపై చంద్రయ్య పోరాటాలు సాగించారన్నారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌పై చంద్రయ్య 1979లోనే దాడి జరిపారని అన్నారు. మండలంలోని శరభవరం గ్రామం కేంద్రంగా చంద్రయ్య తన పోరాటం సాగించారని పేర్కొన్నారు. చంద్రయ్య పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో స్థానిక ఎల్ఐసి ఏజెంట్ జయ కృష్ణ ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.రఘుబాబు దొర అధ్యక్షతన బీమా వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఝూన్సీ హేన్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాలకు ఉత్తమ పౌరులను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ఈ వృత్తిలో కొనసాగుతున్న మనమందరం ఎంతో అదృష్టవంతులమన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు సీహెచ్.సత్యవతి (జీపీఎస్ –చిన అడ్డపల్లి) , ఎస్.ఆర్.విజయలక్ష్మి (జీపీఎస్– చిన గార్లపాడు), కె.లావణ్య (ఎంపీపీ స్కూల్ – గంగవరం), పి.నాగమణి (ఎంపీపీ – స్కూల్ సూరంపాలెం) ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. సీనియర్ ఉపాధ్యాయులు పి.ఉమాదేవి, రాధాకుమారి, వై.లక్ష్మి, వరలక్ష్మి, , కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


అరకులోయలోని ఊరేగింపులో భక్తులు


తాసురుబయలులో కృష్ణుడు చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


రాజవొమ్మంగి శ్రీకృష్ణుని ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్ని కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో యువత సందడి చేశారు. థింసా నృత్యాలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రసాదాలను స్వీకరించారు. అరకులోయలోని పెదలబుడు పంచాయతీ తాంగులగూడ గ్రామంలో కృష్ణుడి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి, పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటి సభ్యులు హరి, లైకోన్, సహదేవ్, అప్పన్న, జగన్నాథం, మంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ తాసరుబయలు గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ అధ్వర్యంలో ఆవుదూడలను గిరిజనులు పూలాభిషకం చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ ధర్మప్రచార ప్రముఖ్ అప్పలరాజు, నాయకుడు అను తదితరులు పాల్గొన్నారు.


ఉట్టి కొడుతున్న చిన్నారి

రాజవొమ్మంగి: స్థానిక కృష్ణుని ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో భారీ అన్నసమారాధన జరిగింది.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంకాలం ఉట్టుకొట్టు వేడుక వైభవంగా జరిగింది.

వీఆర్ పురం: మండలంలోని రేఖపల్లి గొల్లగుడెం, వీఆర్‌పురం, రాజుపేట గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారుల శ్రీకృష్ణుని వేషదారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువకులు ఉత్సాహంతో ఉట్టికోట్టేందుకు కార్యక్రమంలో పాల్గొన్నారు. యాదవ సంఘం మండల ప్రెసిడెంట్ నరేష్ ,వైస్ ప్రెసిడెంట్ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారులతో అవస్థలు


చిత్తడిగా మారిన చిల్లిబడి రహదారి

అరకులోయ రూరల్: మండలంలో గన్నెల పంచాయతీ పరిదిలో గల చిల్లిబడి గ్రామ రహదారి ఇటీవల కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు కోతకు గురవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. రెండు నెలల క్రితం ఈ రోడ్డులో కొన్ని చోట్ల కోతకు గురవడంతో శ్రమదానంతో బాగు చేసుకున్నామని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రహదారి పూర్తిగా దెబ్బతిందని చెబుతున్నారు. కాంట్రాక్టర్ సక్రమంగా పనులుచేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు. రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం నుంచి కాకరపాడు వైపు వెళ్లే ప్రధాన రహదారి పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. తరచూ వాహనాలు గోతుల్లో పడడంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. ఈ రూట్‌లో ఆర్టీసీ బస్ ప్రయాణం కూడా కష్టంగా మారిందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గోతుల్లో మట్టి వేసి పూడ్చాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

టైలరింగ్,ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు శిక్షణ

అచ్యుతాపురం(అనకాపల్లి): హరిపాలెం–అందలాపల్లిలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 60 రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా సత్య సాయి సేవా సంస్థలు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సంస్థల జిల్లా అధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ రాజశేఖర్, సూర్యనారాయణ, నాయుడు, ఆదీశ్వరరావు, సత్యరామ్ పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ


మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంచున్న మంత్రి అమర్‌నాథ్

మునగపాక : మండలంలోని నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పండగలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. నాగులాపల్లిలోని అమ్మవారిని ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రి అమర్‌నాథ్‌ను శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డి వరహా సత్యనారాయణ, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఉప సర్పంచ్ దానకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు ఇల్లా నాగేశ్వరరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దుబాసి నాయుడు, మొల్లేటి శంకర్, సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ: స్తంభించిన రాకపోకలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అనంతగిరి ఘాట్ లో భారీ లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది.. విశాఖపట్నం నుంచి సిమెంట్ లోడ్‌తో అరకు వస్తున్న భారీ లారీ ఘాట్‌రోడ్డులోని రెండో మలుపు వద్ద రోడ్డుకి అడ్డంగా నిలిచిపోయింది. బైకులు చిన్న వాహనాలు అతి కష్టం మీద వెళ్లేందుకు వీలున్నప్పటికీ.. లారీలు, ఆర్టీసీ బస్సులు ఇతర పెద్ద వాహనాల మాత్రం రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయాయి. దీంతో గంటలు తరబడి ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో వాహనాల్లోని ప్రయాణికులు అంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం నుంచి భారీ క్రేన్లు తీసుకొచ్చి లారీని తొలగించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ–పంట నమోదుపై అవగాహన కల్పించాలి

మునగపాక : ఈ–పంట నమోదుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు కోరారు. నాగులాపల్లి, ఉమ్మలాడ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ –పంట నమోదుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.